కె. బి. కృష్ణ

# చిత్రహింస

ఆ నగరంలో నాలుగు రోడ్లకూడలిలో లక్షలఖర్చుతో ఒక ప్రముఖ రాజకీయ నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ మంత్రి విగ్రహం నిర్మించారు, అది ఎవర్దోకాదు. నాదే!

నేనెప్పుడూ తిరిగే ఆ సెంటర్లో నేను మహత్తరమైన రాజకీయ జీవితం గడిపిన ఆ నగరంలో అకాల మృత్యువాత పడ్డ నేను... నా సహచరుల ప్రేమాభిమానాల పుణ్యమా అని ఆ విగ్రహంలో ప్రవేశించాను....

విగ్రహం పూర్తయిన రోజున నగర కమీషనర్ గారు వచ్చి నా కంచు విగ్రహం చూసి "అబ్బ ఎవరండీ ఈ శిల్పి అచ్చు జీవకళ ఉట్టి పడ్తోందీ విగ్రహంలో!" అన్నారు.

అవును మరి! నేను విగ్రహంలో ప్రవేశిస్తే జీవకళ కాక ఏమవుతుంది? నా మీద టార్పాలిన్‌తో ముసుగువేశారు. నా ముసుగు ఎప్పుడు తీస్తారా అని వాళ్ళ సంభాషణ వినసాగాను.

మరి ఈ విగ్రహావిష్కరణ ప్రధానమంత్రి గారితో చేయిస్తే బావుంటుంది. ఈయనేమో ప్రధానమంత్రి గారికి బాగా సన్నిహితులుగా ఉండే వారుట కదా" అన్నారు ఒకరు.

గణపతి నవరాత్రులు వచ్చాయి. బ్యానర్లు కట్టడానికి నా నడుముకు ఒక కొబ్బరి తాడు కట్టారు. నా పీకకు ఒక తాడు కట్టారు. ఇద్దరు చెరో ప్రక్కన నిలబడి బిగిస్తున్నారు. నాకు ఉక్కిరి బిక్కిరౌతోంది. ముసుగు తీసేస్తే నా మెడకిలా తాళ్ళుకట్టరు అప్పుడు దాకా నేనోపిక పట్టాలి.... తప్పదు!

దేవీ నవరాత్రులు వచ్చాయి. పందిళ్ళు వేస్తూ నా రెండు భుజాల రెండు రాటలు వేసి వాటి సహాయంతో పందిరి వేశారు. పందిరి మీద ఎంత మందో ఎక్కి సర్దుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు నన్ను ప్రజలు తమ భుజాలపై మోశారు సంతోషంతో. కానీ....ఇప్పుడు?

ప్రధానికి ఇప్పట్లో పర్యటనకు రావడం కుదర్దని ముఖ్యమంత్రి గారి చేతనే అవిష్కరణ చేయిద్దామని నా ముసుగు తీశారు. రంగులు వేశారు. చాలా అందంగా వున్నాను. ఆయన రాలేదు!

ఆ రోజు ఎవరో ఛోటా రాజకీయనాయకుడు చనిపోయాడట. ఊరేగింపు నా విగ్రహం ముందు ఆగింది. బాంబులు పేలుస్తున్నారు. నాలుగైదు బాంబులు నాకు తగిలాయి. నేను పోయినా ఈ బాంబులు బాధ తప్పడం లేదు. విగ్రహం పెట్టకపోయిన నేను ఈ విగ్రహంలోకి వచ్చి ఉండేవాణ్ణి కాదు. కించిత్ బాధపడ్డాను.

ఒక రోజు కోతుల మంద వచ్చింది, ఒక కోతి నా ముసుగులో దూరింది. ఒక కోతి బయట ఉంది. వాటి శృంగార కేళితో నన్నవి ఛండాలం చేశాయి. ఈలోగా రెండు కాకులు నా మీద వాలి తీరిగ్గా కాలకృత్యాలు తీర్చుకున్నాయి.

ఈ రోజు ప్రధాని వస్తాడట. మళ్ళీ నా ముసుగు తీసి నాకు పెయింట్ వేశారు. కాని ఎందుకో మళ్ళీ ఆయన రాలేదు.

నాకు ఊపిరాడటంలేదు. మళ్ళీ నా నడుంకీ మెడకి తాళ్ళుబిగించి కడ్తున్నారు. నా ఆత్మ ఈ చిత్రవధని భరించలేకపోతోంది.

నేను సంచరించిన ప్రాంతమంతా దర్జాగా విగ్రహ రూపంలో చూడాలన్న నా కోరిక తీరేనా?

దూరంగా విద్యార్థులు పేడ ముద్దలతో వస్తున్నారు. ఏదో ఉద్యమం అనుకుంటా. నా ముఖాన కొట్టేటే వున్నారు. నా మిత్రుల కల్లోకి వెళ్ళి చెప్పాలి. ఇంకెక్కడా ఇక నా విగ్రహాలు పెట్టొద్దని....నన్నిలా సన్మానించొద్దనీ....

—o—